
సాక్షి ఒడిశా

మంగళవారం । 11 । జూలై । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు
భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలక వర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,41,406లు, బంగారం 2.5 గ్రాములు, వెండి 46.5 గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



వేర్వేరు ఘటనల్లో నలుగురి మృతి
- 8లో



మార్మోగిన శివ నామస్మరణ
- 8లో

న్యూస్‌రీల్

నాటక రంగాన్ని ఆదుకోవాలి

● ప్రముఖ నటుడు అల్లెన



రమణమూర్తిని సన్మానిస్తున్న కళాకారులు, తెలుగు సంస్థల ప్రతినిధుల

రాయగడ: ఒకప్పుడు నాటక రంగానికి ఎంతో ఆదరణ ఉండేదని, క్రమేణా ఆదరణ కరువవ్వడంతో పాటు కనుమరుగయ్యే ప్రమాదం పొంచి ఉందని ప్రముఖ కళాకారుడు, బుల్లితెర నటుడు శ్రీకాకుళం జిల్లా పాలకొండకు చెందిన అల్లెన వెంకట రమణ మూర్తి ఆవేదన వ్యక్తంచేశారు. రాయగడకు చెందిన స్పందన సాహితీ, సాంస్కృతిక సంస్థ, కళాసృష్టి, రాయగడ రచయితల సంఘం (రారసం) తదితర తెలుగు సంస్థల ఆధ్వర్యంలో రామలింగేశ్వర మందిరం ప్రాంగణంలో సోమవారం జరిగిన ప్రత్యేక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కళారంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి కళాకారుడిపై ఉందన్నారు. టాలీవుడ్‌లో అల్లరి ప్రియుడు, అల్లరి ప్రేమికుడు, యమలీల, రామదాసు, అన్నమయ్య తదిదర హిట్ చిత్రాల్లో, కళంకిత, లేడీ డిటెక్టివ్ తదితర టీవీ సిరియల్స్‌లో నటించే అవకాశం లభించిందని గుర్తు చేసుకున్నారు. అనంతరం ఆయనను స్పందన అధ్యక్షుడు గుడ్ల గౌరీశంకరరావు, సంస్థల ప్రతినిధులు పతివాడ తులసీదాస్, బాలకృష్ణ పట్నాయక్, తాళ్లపూడి గౌరీ, కొళ్లూరు సుబ్రహ్మణ్యం, కొళ్లూరి గౌరీప్రసాద్, రామ్మోహన్ పట్నాయక్, శివకేశవరావు, టీవీఎస్‌ఆర్ అప్పారావు, భళ్లమూడి నాగేశ్వరరావు, సింగిడి రామారావు, పిల్లల శంకరరావు తదితరులు సన్మానించారు.

మత్స్యకారుల సంక్షేమానికి చర్యలు



మత్స్యకారిని పూజా బెహరాకు బహుమతి అందజేస్తున్న కలెక్టర్ స్మృతిరంజన్

పర్లాకిమిడి: చేపల పెంపకం ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందవచ్చని కలెక్టర్ స్మృతిరంజన్ ప్రధాన్ సూచించారు. దీనికి అనుగుణంగా రాష్ట్రప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమానికి చర్యలు చేపడుతోందని తెలిపారు. జిల్లా కేంద్రంలోని డీఆర్‌డీఏ మందిరంలో జిల్లా మత్స్యవిభాగం ఆధ్వర్యంలో జాతీయ మత్స్యకార దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. జిల్లా మత్స్యశాఖ అధికారి లిషా బెహరా అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన ఉప సంచాలకులు సుశాంతరంజన్ దాస్, జిల్లా ప్రాణిసంపద అధికారి ధర్మేంద్ర మహంతి, సెంచూరియన్ వర్సిటీ మత్స్యవిభాగం అధ్యాపకులు సంబిత్ స్వాయి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు మత్స్యకారులు, స్వయం సహాయక మహిళా సంఘాలకు ఉత్తమ చేపల పెంపకం అవార్డులను అందజేశారు. గుసానిలో పూజా బెహరా, సోనీ పండా, గుమ్మా బ్లాక్‌లో గణపతి గౌడో, రాయఘడ బ్లాక్‌లో గౌరంగో శొబొరొ, ఆర్.ఉదయగిరిలో మాసంతోషి మిషన్‌శక్తి సంఘాలు బహుమతులు పొందిన వాటిలో ఉన్నాయి.

తెలుగు విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు



విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందిస్తున్న దృశ్యం

బరంపురం: నగరానికి చెందిన మహాత్మా హెల్పింగ్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక సిటీ హైస్కూల్ తెలుగు పాఠశాలకు చెందిన విద్యార్థులకు ఉచితంగా పాఠ్య, నోటు పుస్తకాలు సోమవారం అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఫణిభూషణ్ మజ్జి, తెలుగు ఉపాధ్యాయులు మాజీ కార్పొరేటర్ జగన్నాథరావు ఆచారి, క్లబ్ ఆర్గనైజింగ్ ప్రతినిధులు సుజాత ముఖర్జీ, ఎం.వెంకటరమణ, ఎ.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వరుణుడి జాడేది!

● రాష్ట్రంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు
● గత 40 రోజుల్లో 32శాతం లోటు వర్షపాతం నమోదు
● రుతు పవనాల మందగమనంతో ఖరీఫ్ సాగుపై ప్రభావం





భువనేశ్వర్: గత 3 రోజులుగా ఉత్తర భారతదేశంలో కుంభ వృష్టితో వరదలు ముంచెత్తుతుండగా.. రాష్ట్రంలో వరుణుడి జాడ కొరవడింది. ఈ పరిస్థితి తీవ్ర ఆందోళన కలిస్తోంది. జూన్ 1 నుంచి జూలై 10మధ్య రాష్ట్రంలో 32.2శాతం లోటు వర్షపాతం నమోదైంది. ఇది ఖరీఫ్ సీజన్‌ను ప్రభావితం చేస్తుందని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) భువనేశ్వర్ కార్యాలయం సోమవారం వెల్లడించింది. రాష్ట్రంలో సాధారణంగా దీర్ఘకాలిక సగటు(ఎల్‌టీపీ) 326.1 మిల్లీమీటర్లు. అయితే ఈ ఏడాది జూన్ నుంచి జూలై 10వ తేదీ వరకు వాస్తవ సగటు వర్షపాతం 221.3 మిల్లీమీటర్లుగా కొనసాగింది. ఇది సాధారణం కంటే 32.2శాతం లోటును నమోదు చేసింది. రాష్ట్రంలోని దేవ్‌గడ్, సంబల్‌పూర్, ఝార్సుగుడ, అంగుల్, బర్‌గడ్, డెంఖనాల్, సుందర్‌ఘడ్, మల్కన్‌గిరి సహా 8జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదై, మిగిలిన 22 జిల్లాల్లో లోటు నెలకొందని వాతావరణ సంస్థ తెలిపింది.

పశ్చిమ ఒడిశాలో..
13 జిల్లాలు తీవ్ర లోటు కేటగిరీలో ఉన్నాయి. ఈ జాబితా ప్రకారం పశ్చిమ ప్రాంతంలోని దేవ్‌గడ్ జిల్లాలో 454.5 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. ఇదే జిల్లాలో సాధారణ వర్షపాతం 386.8 మిల్లీమటర్లు కాగా.. 17.5శాతం అధికంగా కురిసింది. పశ్చిమ ఒడిశా ప్రాంతం కలహండిలో అత్యధికంగా లోటు వర్షపాతం నమోదైంది. ఈ ప్రాంతంలో 116.8 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. ఇక్కడ సాధారణ వర్షపాతం 346.1 మిల్లీమీటర్లుగా కొనసాగాల్సి ఉంది. ఈ లెక్కన కలహండిలో 66.2శాతం లోటు ఉంది. తరువాతి స్థానంలో మయూర్‌భంజ్‌ల 55.6శాతం లోటు ఉండగా, ఇక్కడి సాధారణ వర్షపాతం 374.6 మిల్లీమీటర్లకు బదులుగా 166.5 మిల్లీమీటర్లు వాస్తవ వర్షపాతం నమోదైంది. ఖుర్దా జిల్లా సాధారణ వర్షపాతం 294.6 మిల్లీమీటర్లు. ఇప్పటి వరకు ఈ ప్రాంతంలో నామమాత్రంగా 181.7 మిల్లీమీటర్లు వర్షపాతం రికార్డు కావడంతో 38.6శాతం లోటు ఖరారైంది.

ఆగ్నేయ గాలులతో..
అయితే ఈనెల 13వరకు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. జూలై 3వ వారంలో ఒడిశాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని సమాచారం. రాష్ట్రంలో రుతుపవనాలు బలహీనంగా ఉన్నప్పటికీ, బంగాళాఖాతం నుంచి కోస్తా వైపు ఆగ్నేయ గాలులు విస్తరించే అనుకూల పరిస్థితులు ఉన్నాయి. దీని ప్రకారం ఈనెల 21-23 మధ్య రాష్ట్రంలో వర్షపాతం పెరిగే అవకాశం ఉందని అంచనా. 80శాతం కంటే అధికంగా తేమ ఉండటం వల్ల రుతుపవనాల ప్రభావం డీలాపడి చెదురు మదురు జల్లుతో తేలికపాటి నుంచి మోస్తరు వర్షపాతం నమోదైందని స్థానిక శిక్ష్యా ఓ అనుసంధాన్(ఎస్‌ఓఏ) సెంటర్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ అండ్ క్లైమేట్(సీఈసీ) సోమవారం ప్రకటించింది. వాయువ్య బంగాళాఖాతంలో వాయుగుండం ఏర్పడి అల్పపీడనంగా మారే అవకాశం ఉంది. క్రమంగా ఈనెల 20 నాటికి తీవ్ర అల్పపీడనంగా మారుతుందని ఈ కేంద్రం ముందస్తు అంచనా సమాచారం జారీ చేసింది. అలాగే ఉత్తర, పశ్చిమ ఒడిశాలో జూలై 21 నుంచి 23 వరకు చాలా చోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వివరించింది. అలాగే దీని ప్రభావంతో ఈనెల 18నుంచి రాష్ట్రంలో వర్షపాతం పెరుగుతుందని భావిస్తున్నారు.

20 జిల్లాల్లో.. ఉరుములు, మెరుపులు

భువనేశ్వర్: రానున్న 24 గంటల్లో రాష్ట్రంలోని 20 జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) హెచ్చరించింది. బాలాసోర్, భద్రక్, జాజ్‌పూర్, కేంద్రాపడా, కటక్, జగత్‌సింగ్‌పూర్, పూరీ, ఖుర్దా, నయాగఢ్, గంజాం, గజపతి, మల్కన్‌గిరి, కొరాపుట్, రాయగడ, కలహండి, కంధమల్, అంగూల్, డెంఖనాల్, కెంజొహార్, మయూర్‌భంజ్ జిల్లాల్లో 1, 2 చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడే అవకాశం ఉంది. ఆయా ప్రాంతాలకు ఎల్లో వార్నింగ్ జారీ చేసినట్లు ఐఎండీ తెలిపింది. రానున్న 24 గంటల్లో దక్షిణ ఒడిశా ప్రాంతం గజపతి, గంజాం జిల్లాల్లో చాలాచోట్ల, మిగిలిన జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు నుంచి ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉందని ప్రకటించింది. భువనేశ్వర్, పరిసర ప్రాంతాల్లో వర్షం లేదా ఉరుములతో కూడిన వర్షం పడే అవకాశంతో ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుందని వివరించింది.

● గవర్నర్‌తో జస్టిస్ నరేంద్రకుమార్ భేటీ



స్థానిక రాజ్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్ ప్రొఫెసర్ గణేషీలాల్‌తో న్యూఢిల్లీ బలహీన విద్యాసంస్థల జాతీయ కమిషన్ చైర్మన్ జస్టిస్ నరేంద్రకుమార్ జైన్ మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. సోమవారం వీరివురూ భేటీ అయ్యారు. - భువనేశ్వర్

మిషన్ 2024

● సార్వత్రిక ఎన్నికలే లక్ష్యంగా సీఎం నవీన్ అడుగులు
● 9 ప్రతిపాదనలకు రాష్ట్ర మంత్రిమండలి ఆమోదం



మంత్రిమండలి తీర్మానాలు వివరిస్తున్న సీఎస్ ప్రదీప్ జెనా

భువనేశ్వర్: ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ అధ్యక్షతన స్థానిక లోక్‌సేవా భవన్‌లో సోమవారం జరిగిన రాష్ట్ర మంత్రివర్గ కీలక సమావేశంలో 9 ప్రతిపాదనలు ఆమోదం పొందాయి. దీనికి సంబంధించిన వివరాలను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ కుమార్ జెనా మీడియాకు వెల్లడించారు. 'అమొ ఒడిశా-నవీన ఒడిశా' అనే కొత్త పథకానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. సార్వత్రిక ఎన్నికలకు ముందు రాష్ట్రప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభించడం ప్రాధాన్యత సంతరించుకుంటుంది. అమొ గావ్ అమో బికాసా అధునాతన రూపంతో కొత్త పథకాన్ని ప్రవేశ పెట్టడం గమనార్హం. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో గ్రామాభివృద్ధి పథకాలను అమలు చేస్తారు. దీనికి గాను రూ.4 వేల కోట్లు కేటాయించారు. ఒక్కో పంచాయతీకి రూ.50 లక్షల వరకు నిధులు మంజూరు చేస్తారు. జగన్నాథ సంస్కృతి, సంప్రదాయాల విస్తరణకు ఈ నిధుల వినియోగానికి అనుమతిస్తారు. ప్రార్థనా స్థలాల్లో పర్యాటకుల సౌకర్యాల కోసం రూ.10 లక్షలు వెచ్చించనున్నారు.

ఇంకా మరిన్ని..
● 9, 10వ తరగతి విద్యార్థులకు టీ షర్ట్, ప్యాంట్, షూ(బూట్లు), సాక్స్‌లు యూనిఫాంగా ఇచ్చేందుకు నిర్ణయించారు.
● కుయీ(కోయ) భాషకు రాజ్యాంగ హోదా ఇవ్వాలని సిఫార్సులో పేర్కొన్నారు.
● ఖరస్రోత నది, కేంద్రాపడా బలితా మధ్య వంతెన నిర్మిస్తారు. ఈ ప్రాజెక్టు వ్యయ ప్రణాళిక రూ.97 కోట్ల 24 లక్షలకు మంత్రిమండలి ఆమోదించింది. వంతెనను ఈపీసీ విధానంలో నిర్మించాల్సి ఉంటుందని కేబినెట్ స్పష్టం చేసింది.
● బలంగీర్‌లోని రాజేంద్ర కళాశాలకు 8 ఎకరాల 693 డెసిమల్ భూమిని ఉచితంగా కేటాయించేందుకు అంగీకరించారు.
● కొరాపుట్ జిల్లా లమతాపుట్ డిగ్రీ కళాశాల భవనం నిర్మాణానికి 5 ఎకరాల విస్తీర్ణంలో స్థలం ఉచితంగా అందజేస్తారు.
● నిరుపయోగ భూముల సరెండర్ చేయడం లేదా సద్వినియోగం కార్యకలాపాల కోసం దస్తావేజుపై స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయింపు ప్రతిపాదనకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది.
● ఇడ్కో ఆధ్వర్యంలో పరిశ్రమల ఏర్పాటులో లీజుకు ఇచ్చిన భూముల కేటాయింపులో ఉపకరిస్తుందని మంత్రిమండలి అభిప్రాయం వ్యక్తం చేసింది.
● ముఖ్యమంత్రి పవర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం కింద విద్యుత్ పంపిణీ విధానం మెరుగుదల పనులను అమలు చేసే ప్రతిపాదనకు అంగీకరించారు.
● రూ.1,284.99 కోట్ల విలువైన ప్రాజెక్ట్‌లు 2023-24, 2024-25 ఆర్థిక సంవత్సరాల్లో డిస్కమ్‌ల ద్వారా అమలు చేయనున్నట్లు ప్రకటించారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ



మొక్క నాటుతున్న చావ్ పట్నాయక్, సుభాష్ మహరణ

బరంపురం: పెరిగిపోతున్న వాతావరణ కాలుష్యాన్ని అరికట్టి, పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలంటే మొక్కల పెంపకంతోనే సాధ్యమని బీజేడీ గంజాం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రమేష్‌చంద్ర చావ్ పటాన్నయక్ తెలిపారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో బరంపురం అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం సోమవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటడమే కాకుండా మూడేళ్లు వాటి సంరక్షణకు బాధ్యతను స్థానికులు తీసుకోవాలని కోరారు. పచ్చదనాన్ని పరిరక్షించేందుకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటి, వాటిని దత్తత తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీడీఏ చైర్మన్ సుభాష్ మహరణ, బీజేడీ నగర అధ్యక్షుడు విజయ్ సామల్, భీష్మాచారి చౌధురి, మహిళా నాయకులు పాల్గొన్నారు. అలాగే లంజిపల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు మొక్కలు నాటారు.

మహిళా వాకర్స్ ఆధ్వర్యంలో..
రాయగడ: జంఝావతి మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో వన మహోత్సవ కార్యక్రమం స్థానిక మహిళా కళాశాలలో నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా తమవంతు సహకారం అందించేందుకు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని క్లబ్ అధ్యక్షురాలు అరుణా బెహరా తెలిపారు. స్థానికంగా ఉన్న అన్ని పాఠశాలలు, కళాశాలల్లో ఈ కార్యక్రమం ద్వారా మొక్కలు నాటుతామన్నారు. ప్రధానంగా పండ్ల మొక్కలు ప్రాధాన్యత కల్పిస్తున్నామని, ఇందులో భాగంగా స్థానిక కళాశాలలో జామ, నేరేడు, బొప్పాయి, దానిమ్మ తదితర 100 మొక్కలు నాటామని వివరించారు. ప్రతి విద్యార్థీ మొక్కల సంరక్షణ బాధ్యత తీసుకునేలా వారికి అవగాహన కలిగించామన్నారు. కార్యక్రమంలో క్లబ్ ఉపాధ్యక్షురాలు లీనా సేనాపతి, కార్యదర్శి రస్మిత పండా, కోశాధికారి నమితా పాఢి తదితరులు పాల్గొన్నారు.



లంజపల్లి వన మహోత్సవంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఏకలవ్య విద్యాలయ ప్రాంగణంలో..
జయపురం: సబ్ డివిజన్ పరిధి సమితి కొంగ గ్రామంలోని ఏకలవ్య విద్యాలయ ప్రాంగణంలో వన మహోత్సవం నిర్వహించారు. జయపురం సంబాద సాహిత్య ఘరో, అటవీశాఖ సంయుక్తంగా నిర్వహించిన వృక్షారోపణ కార్యక్రమంలో వివిధ రకాలకు చెందిన 200 లకు పైగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో అటవీశాఖ అధికారి సచ్చిదానంద పరిడ, ఏకలవ్య విద్యాలయ ప్రిన్సిపాల్ జయంతికుమార్ లెంక మొక్కలు నాటే కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. విద్యావేత్త ప్రశాంతకుమార్ బిశాయి పాల్గొని మాట్లాడారు. ప్రకృతి వైపరీత్యాలకు ప్రధాన కారణం చెట్లను నరికి వేయడం, అడవులను ధ్వంసం చేయడమే కారణమని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అమితి బిసి, కుసుమ మంజరీ, దీప్తి మయి, సుమన్ పాణిగ్రహి, దీపిక దాస్, సుప్రియ భుయ, ప్రతిభ భక్తీ, మనోలిష పట్నాయక్, బినోదిని గౌఢ, రాజేష్‌కుమార్ బిశాయి, డీవీ రావు, ఏ.సుధీర్‌కుమార్, రమాకాంత డుమిలియ, అశుతోష్ మిశ్రా తదితరులు సహకరించారు.



జయపురం: ఏకలవ్య విద్యాలయంలో వన మహోత్సవం



రాయగడ: పండ్ల మొక్కలు నాటుతున్న మహిళలు

మావోయిస్టుల డంప్ స్వాధీనం



స్వాధీనం చేసుకున్న డంప్‌ను పరిశీలిస్తున్న జవాన్లు

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి 142 బెటాలియన్‌కు చెందిన బీఎస్‌ఎఫ్ జవాన్లు గొంపకొండ రిజర్వ్ ఫారెస్ట్‌లో మావోయిస్టులు అమర్చిన డంప్‌ను సోమవారం స్వాధీనం చేసుకున్నారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. ముందస్తు సమాచారంతో బొడిగేట పంచాయతీ మారిగేట అటవీ ప్రాంతంలో జవాన్లు కూంబింగ్ చేపట్టారు. గొంపకొండ ప్రాంతంలో డంప్‌ను గుర్తించి, బయటకు తీశారు. ఇందులో 25 డిటోనేటర్లు, 108 జిలిటెన్ స్టిక్స్, 4 సేఫ్టీ ఫ్యూజ్, 20 హ్యాండ్ గ్రెనేడ్, 10 బేల్ట్‌లు, 4 విజిల్స్, మావోయిస్టు సాహిత్యం, ఐరెన్ బాక్స్ తదితర సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.

చిరుతపులి కలకలం



ఘుమసుర అటవీ ప్రాంతంలో సంచరిస్తున్న చిరుత



సీసీ కెమెరా ఫుటేజ్‌ను పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

బరంపురం: గంజాం జిల్లా బంజ్‌నగర్ సబ్ డివిజన్ ఘుమసుర అటవీ ప్రాంతంలో చిరుతపులి కలకలం సృష్టించింది. దీనిపై గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తూ అటవీశాఖ అధికారులుకు సోమవారం సమాచారం అందించారు. ఈ మేరకు తమ శాఖ కార్యాలయంలోని సీసీ టీవి ఫుటేజ్‌ను పరిశీలించగా, గ్రామస్తుల తెలిపిన వివరాలు వాస్తవమేనని తేలింది. ఈ మేరకు చిరుత కదలికలపై పూర్తి నిఘా పెట్టామని అధికారులు తెలిపారు. ఎవరూ ఆందోళన చెందవద్దని, రాత్రి సమయాల్లో ఒంటరిగా ఎవరూ బయట తిరగవద్దని సూచించారు.

జిల్లా అధ్యక్షుడికి ఘన స్వాగతం



బొయిపరిగుడలో సంప్రదాయ స్వాగతంతో ఆహ్వానిస్తున్న దృశ్యం

జయపురం: అధికార పార్టీ బీజేడీ కొరాపుట్ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన జిన్నా హికాక సోమవారం జయపురంలో పర్యటించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. పూల మాలలతో సత్కరించారు. రానున్న ఎన్నికల్లో బీజేడీ అభ్యర్థులు విజయం సాధించేలా నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేసేందుకు చిత్తశుద్ధిగా పని చేయాలని ఈ సందర్భంగా హికాక సూచించారు. అంతా కలసికట్టుగా పనిచేస్తే జిల్లాలో బీజేడీ విజయం నల్లేరుపై నడక కాగలదని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు దుర్గా మిశ్రా, అనూప్‌కుమార్ పాత్రొ, శివ పట్నాయక్, సుధీర్ త్రిపాఠి, బాలా రాయ్, ధన ఖొర, మున్నా పాఢి, సన గంతాయత్, రామనాథ్ పాణిగ్రహి, నాగరాజు దొర, సంతోష్ మిశ్రా, బులు ప్రధాన్, టునా పట్నాయక్, అనీల్ పట్నాయక్, హరప్రసాద్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయ నృత్యాలతో..
జయపురం: బీజేడీ కొరాపుట్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన బొయిపరిగుడ సమితి అధ్యక్షుడు ప్రశాంతకుమార్ గుప్తాకు ఘనస్వాగతం లభించింది. పార్టీ అధిష్టానం చేపట్టిన ఈ నియామయం పొందిన అనంతరం ఆయన తొలిసారిగా తన స్వగ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలు, బీజేడీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. ప్రజలు తమ సంప్రదాయ నృత్యాలు, వాయిద్యాలతో పట్టణంలో ఊరేగించి, సహిద్ లక్ష్మణ నాయక్ గ్రంథాలయం వద్ద సమావేశమయ్యారు. కార్యక్రమంలో కొరాపుట్ ఎమ్మెల్యే రఘునాథ్ పడాల్, కొట్‌పాడ్ ఎమ్మెల్యే, మాజీమంత్రి పద్మినీ దియాన్, జిల్లా పరిషత్ అధ్యక్షుడు రాధా వినోద్ సామంతరాయ్, జయపురం మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ సూర్యనారాయణ రథ్, బీజేడీ బ్లాక్ అధ్యక్షుడు హేమంతకుమార్ మహాపాత్రొ, యూత్ అధ్యక్షుడు రమేష్‌కుమార్ స్వాయ్, జిల్లా పరిషత్ సభ్యులు రాజేష్‌కుమార్ మహురియ తదితరులు పాల్గొన్నారు. జిల్లాలో పార్టీని మరింతగా బలోపేతం చేసేందుకు ఉమ్మడిగా పని చేద్దామని పిలుపునిచ్చారు.



జిన్నా హికాకు స్వాగతం పలుకుతున్న పార్టీ శ్రేణులు

న్యూస్‌రీల్

ప్రభుత్వం ద్వారా చైల్డ్‌లైన్ సేవలు

శ్రీకాకుళం పాతబస్టాండ్‌: ప్రభుత్వం ద్వారా నేరుగా చైల్డ్‌లైన్ సేవలు అందుతాయని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. ఇప్పటి వరకు చైల్డ్ లైన్ (1098) సేవలు చైల్డ్‌లైన్ ఇండియా ఫౌండేషన్ అనే స్వచ్ఛంద సంస్థ ద్వారా అందేవని, ఇప్పుడు జిల్లాల్లో బాలల పరిరక్షణ విభాగంతో అనుసంధానించారని వివరించారు. జూలై 7 అర్ధరాత్రి నుంచి దేశవ్యాప్తంగా ప్రభుత్వ ఆధీనంలో హెల్ప్‌లైన్ పని చేస్తుందన్నారు. దీన్ని సోమవారం స్పందన హాల్‌లో ఆయన లాంఛనంగా ప్రారంభించారు. నిస్సహాయ బాలల కోసం ఈ చైల్డ్ హెల్ప్‌లైన్(1098) పనిచేస్తుందని మహిళ, శిశు సంక్షేమ, సాధికారత అధికారి జయదేవి తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్, జేసీ ఇతర అధికారులు చైల్డ్ హెల్ప్ లైన్ సేవలకు సంబంధించిన గోడ పత్రికను ఆవిష్కరించారు. అలాగే చైల్డ్ హెల్ప్ లైన్‌లో పని చేసేందుకు సిబ్బందికి తాత్కాలిక ప్రాతిపదికన షరతులతో కూడిన ఒప్పంద నియామక పత్రాలను అందజేశారు.

22న ప్రత్యేక లోక్ అదాలత్



మాట్లాడుతున్న ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం పాతబస్టాండ్‌: ప్రత్యేక లోక్ అదాలత్‌ను ఈ నెల 22న నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు జునైద్ అహ్మద్ మౌలానా తెలిపారు. ఆయన సోమవారం తన చాంబర్‌లో పలు బీమా కంపెనీల ప్రతినిధులు, లాయర్లతో మాట్లాడారు. మోటార్ యాక్సిడెంట్ కేసులు, ల్యాండ్ ఎక్విజేషన్ కేసులు ఎక్కువ సంఖ్యలో పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవడం వల్ల సమయం ఆదా అవుతుందన్నారు.

వంశధార కుడి కాలువలో నిండుగా సాగునీరు



వంశధార కాలువలో సాగునీటి ప్రవాహం

ఎల్.ఎన్.పేట: వంశధార కుడి ప్రధాన కాలువలో సాగునీటి ప్రవాహం జోరందుకుంది. వంశధార కుడి కాలువలోకి రెండు రోజుల కిందట సాగునీరు విడిచిపెట్టడంతో కాలువ కళకళలాడుతోంది. రైతులు పంట పొలాలకు, నారుమడులకు నీటిని మళ్లించగా మరి కొన్ని గ్రామాలకు చెందిన రైతులు సాగునీటి చెరువులను నింపుతున్నారు. వారం రోజుల్లో చెరువులు నిండిపోతే దమ్ములు, నాట్లు వేసే పనులు ప్రారంభిస్తామని జాడుపేట, ఎఫ్‌డీ పేట, కుశమలపాడు, చింతలబడవంజ, రావిచెంద్రి, ముంగెన్నపాడు, బరటాం, కృష్ణాపురం తదితర గ్రామాలకు చెందిన రైతులు చెబుతున్నారు.

స్పందనకు 232 అర్జీలు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, జేసీ నవీన్, ఇతర అధికారులు

శ్రీకాకుళం పాతబస్టాండ్‌: స్పందన అర్జీలు సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అధికారులను ఆదేశించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం, స్పందన కార్యక్రమంలో పాల్గొని అర్జీలు స్వీకరించారు. ఆయనతో పాటు జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, ఇన్‌చార్జి డీఆర్‌ఓ మురళీకృష్ణ, ప్రత్యేక ఉప కలెక్టర్ జయదేవి, డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్ పాల్గొన్నారు. స్పందన, ఏపీ సేవ, మీ సేవ కింద అందిన అర్జీల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ఈ వారం స్పందనకు 232 అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో డీఎస్‌ఓ వెంకటరమణ, జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి తిరుమల చైతన్య, డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.మీనాక్షి, జిల్లా ఉద్యాన అధికారి ప్రసాదరావు, అన్ని శాఖల జిల్లా అధికారులు, పాల్గొన్నారు.

మరోసారి కేజీబీవీ ఉద్యోగార్థుల సర్టిఫికెట్ల పరిశీలన

శ్రీకాకుళం న్యూకాలనీ: కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లో వివిధ పోస్టులకు ఎంపికైన మహిళా అభ్యర్థుల సర్టిఫికెట్లను మరోసారి పరిశీలించాలని అధికారులు నిర్ణయించారు. వివిధ కారణాలతో ఉద్యోగాలకు ఎంపికకాలేనివారు చేస్తున్న ఆరోపణలు, ఫిర్యాదుల నేపథ్యంలో మరోసారి నిజనిర్ధారణ చేసుకునేందుకు ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు వారు మార్కుల జాబితాను పరిశీలిస్తారు. కలెక్టర్ సూచనల మేరకు ఈ నెల ఒకటి నుంచి మూడో తేదీ వరకు ఇంటర్వ్యూలు/స్కిల్ టెస్ట్ ద్వారా ప్రిన్సిపాల్, పీజీటీ, సీఆర్టీ, పీఈటీ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లు, వారి మార్కుల లిస్టులను మరోసారి పరిశీలిస్తామని సమగ్రశిక్షా ఏపీసీ డాక్టర్ రోణంకి జయప్రకాష్ తెలిపారు. జిల్లా కలెక్టరేట్‌లో ఈనెల 11వ తేదీ నుంచి మూడు రోజులపాటు ఉదయం పది నుంచి సాయంత్రం ఐదు గంటల సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందన్నారు. ఫేక్ అని తేలితే ఎంపికైన పోస్టును రద్దుచేస్తామని తెలిపారు.

వేర్వేరు ఘటనల్లో నలుగురి మృతి

• మృతుల్లో బీఎస్‌ఎఫ్ జవాన్



ఆస్పత్రి వద్ద వివరాలు సేకరిస్తున్న ఎస్పీ నితీష్ వాధ్వనీ



ఘటనా స్థలంలో చెల్లా చెదురుగా పడి ఉన్న బాధితులు

మల్కన్‌గిరి: వేర్వేరు జిల్లాలో చోటు చేసుకున్న ఘటనల్లో నలుగురు వ్యక్తులు మృతిచెందారు. మరో ఇద్దరు గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. మల్కన్‌గిరి సమితి ఛంపఖారి గ్రామం వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో విశ్వనాథ్ మడకామి(32) అనే బీఎస్‌ఎఫ్ జవాన్ మృతిచెందారు. మల్కన్‌గిరిలో విధులు పూర్తి చేసుకున్న ఆయన.. రాత్రి 10.30 గంటల సమయంలో బైక్‌పై స్వగ్రామం పాదరపల్లికి బయలుదేరాడు. పండ్రివణి పంచాయతీ కొత్తమేట గ్రామానికి చెందిన సునధర్ కోప, బలరాం పూజారి, బళ పూటియా బైక్‌పై మల్కన్‌గిరికి వస్తున్నారు. చంపఖారి వద్ద ఘాటీ మలుపులో ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు బలంగా ఢీకొన్నాయి. దీంతో చెల్లాచెదురుగా పడిపోగా, గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించారు. నలుగురినీ మల్కన్‌గిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు.. విశ్వనాథ్ తలకు బలమైన గాయం కావడంతో మృతి చెందినట్లు ప్రకటించారు. విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ నితీష్ వాధ్వనీ ఆస్పత్రికి చేరుకొని, ఘటనపై ఆరా తీశారు. సత్వర విచారణకు సిబ్బందికి ఆదేశించారు. అలాగే మృతదేహానికి సోమవారం ఉదయం పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం స్వగ్రామంలో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. అలాగే తీవ్ర గాయాలైన మిగతా ముగ్గురినీ కొరాపుట్ లోని సహిద్ లక్ష్మణ్ నాయక్ వైద్య కళాశాల ఆస్పత్రికి రిఫర్ చేశారు.



విశ్వనాథ్ మడకామి(ఫైల్)

వృద్ధుడి ఆత్మహత్య..

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంని బ్లాక్ కాలానీకి చెందిన ఓ వృద్ధుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. డి.గగన్ మోహన్(63), తన భార్య పిల్లలతో కలిసి చాలాకాలంగా నివాసం ఉంటున్నారు. కుటుంబ సభ్యులంతా ఆదివారం రాయగడకు వెళ్లారు. ఆర్థికసాయం ఇబ్బందులు కారణంతో మానస్థాపానికి గురైన ఆయన.. ఇదే అదునుగా భావించి, ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నారు. సోమవారం ఉదయం ఇరుగు-పొరుగు వారు పిలిచినా ఎంత సేపటికీ స్పందించక పోవడంతో కిటికీ నుంచి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. వెంటనే మల్కన్‌గిరి పోలీసులకు సమాచారం అందిదంచగా, ఐఐసీ రీగాన్ కీండో, సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. మృతదేహన్ని స్వాధీనం చేసుకొని, పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



మల్కన్‌గిరి: గగన్‌మోహన్ మృతదేహం వద్ద విలపిస్తున్న భార్య

కొండచరియలు విరిగి పడి..

భువనేశ్వర్: భారీ వర్షం కురవడంతో కొండ చరియలు జారిపడి ఇద్దరు వ్యక్తులు మృతిచెందారు. కలహండి జిల్లా అలొభొతా గ్రామం సమీపంలోని దుర్కడంగరి ప్రాంతంలో ఈ విషాద ఘటన చోటు చేసుకుంది. అలొభొతా గ్రామానికి చెందిన రాజకుమారి నాయక్(30), ముకుంద పరభొయి(55) మృతులుగా గుర్తించారు. వీరివురూ రాళ్లు కొట్టే కార్మికులు. రోజు తరహాలోనే యథావిధిగా రాళ్లు కొట్టి, ఇంటికి తిరిగి వెళ్తుండగా అకస్మాతుగా వాన కురవడంతో తల దాచుకునేందుకు కొండ చాటున నిలబడ్డారు. అదే సమయంలో పెద్ద కొండ చరియ వీరి తలపై జారడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు ప్రత్యక్ష సాక్షుల సమాచారం. విషయం తెలియడంతో జయపట్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని, సత్వర సహాయక చర్యలు చేపట్టారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను స్థానిక ఆస్పత్రికి తరలించారు. జయపట్న థాణా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వినతుల వెల్లువ



పట్టాలు పొందిన లబ్ధిదారులతో కలెక్టర్ స్మృతిరంజన్, ఎస్టీసీ చైర్‌పర్సన్ రైతో



దంపతులకు ఆర్థికసాయం అందిస్తున్న కలెక్టర్ స్వాధాదేవ్ సింగ్

• 152 ఫిర్యాదులు స్వీకరించిన అధికారులు

పర్లాకిమిడి/రాయగడ: జిల్లాలోని గుణుపూర్ సబ్ డివిజన్ పరిధి లంజియా సవర తెగకు చెందిన ఆదివాసీలు నివసిస్తున్న పుటాసింగి పంచాయతీలో ఉన్న లంజియా సవర అభివృద్ధి సంస్థ కార్యాలయం సమావేశ మందిరంలో జిల్లా యంత్రాంగం తొలిసారిగా గ్రీవెన్స్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించింది. కలెక్టర్ స్వాధాదేవ్ సింగ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అత్యధికంగా మౌలిక సౌకర్యాలు మెరుగు పరచాలని ఆ ప్రాంత ప్రజలు విన్నవించారు. పుటాసింగి పంచాయతీలో వివిధ గ్రామాల్లో ఇప్పటి వరకు సరైన రహదారులు, తాగునీరు వంటి మౌలిక వసతులు అందడం లేదని, ఇళ్ల పట్టాలు, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్పందిస్తూ రహదారులు లేని గ్రామాలను గుర్తించాలని, ప్రతి గ్రామానికి తాగునీటి సౌకర్యం కల్పించే విధంగా సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే ఆలస్యంగా వివాహం చేసుకున్న ఓ జంటకు ప్రోత్సాహకం కింద రూ.20 వేలు, రెడ్‌క్రాస్ నిధుల నుంచి మరొకరికి రూ.5 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. మొత్తం 99 వినతులు కలెక్టర్ దృష్టికి రాగా, ఇందులో 32 వ్యక్తిగతమైనవి, 67 గ్రామ సమస్యలు ఉన్నాయి. కార్యక్రమంలో గుణుపూర్ సబ్ కలెక్టర్ లలిత్‌కుమార్ కుహూరో, జిల్లా విద్యాశాఖ అధికారి పూర్ణచంద్ర భొరియా, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

53మందికి పట్టాలు పంపిణీ..

పర్లాకిమిడి జిల్లాలోని గుమ్మా బ్లాక్ ఉక్కురా పంచాయతీ కార్యాలయంలో జిల్లా గ్రీవెన్స్ సెల్ కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ స్మృతిరంజన్ ప్రధాన్ అధ్యక్షత వహించగా, జిల్లా ఎస్పీ స్వాతి ఎస్.కుమార్, ఐటీడీఏ పీఓ ఫాల్గుణీ మాఝి, జిల్లా స్వతంత్ర అభివృద్ధి చైర్‌పర్సన్ మరియం రైతో హాజరయ్యారు. ఇందులో మొత్తం 76 వినతులు అందగా, వీటిలో వ్యక్తిగతం 36, గ్రామ సమస్యలపై 45 వినతులు వచ్చాయి. 25 అభియోగాలను అక్కడికక్కడే పరిష్కరించారు. అనంతరం 53మంది లబ్ధిదారులకు అటవీ, భూ పట్టాల అందజేశారు. కార్యక్రమానికి గుమ్మా సమితిలోని తరవ, రంగిడి, ఉక్కురా పంచాయతీల ప్రజలు చేరుకున్నారు. ఎక్కువగా గృహ నిర్మాణాలు, సాగునీరు, పట్టాలు, సామాజిక సురక్ష, పింఛన్లు, రేషన్ కార్డులపై అభియోగాలు నమోదయ్యాయి. కార్యక్రమంలో బీడీఓ అనూప్‌అభిషేక్ బెహరా, సమితి అధ్యక్షురాలు సునేమీ మండళ్, సర్పంచ్ జేసీ గమాంగో, నోడల్ అధికారులు పాల్గొన్నారు.



ఎస్‌హెచ్‌జీ సభ్యుల స్టాల్‌ను తిలకిస్తున్న కలెక్టర్

కొబ్బరి రైతుల సంక్షేమానికి కృషి



రైతులకు కొబ్బరి మొక్కల్ని పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ

కవిటి: ఉద్దానం ప్రాంతంలో కొబ్బరి పంట అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని జెడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ అన్నారు. బొరివంకలో మండల కొబ్బరి రైతు ఉత్పత్తిదారుల సమాఖ్య (ఎఫ్‌పీఓ) ఆధ్వర్యంలో రైతులకు రాయితీపై కడియం నర్సరీ నుంచి తీసుకువచ్చిన కొబ్బరి మొక్కలను సోమవారం ఆమె పంపిణీ చేశారు. మండలంలోని 475 మంది రైతులకు 22,000 కొబ్బరి మొక్కల్ని పంపిణీ చేస్తున్నట్టు కవిటి ఏపీఎం కె.గోవింద్ తెలిపారు. వాసన్ అనే స్వచ్ఛంద సంస్థ సగం నిధుల్ని తిత్లీ తుఫాన్ ప్రభావిత కొబ్బరి రైతులను అభివృద్ధి చేసేందుకు సమకూర్చిందని ఏపీఎం గోవింద్ తెలిపారు. ఒక్కో మొక్కకు రైతుల వాటా రూ.20 చెల్లించగా మరో రూ.20 ను వాసన్ సంస్థ భరించిందన్నారు. ఈ మొక్కల్ని తిత్లీ తుఫాన్‌కు నేలకొరిగిన చెట్ల స్థానంలో నాటుకునేందుకు వీలుగా సరఫరా చేసినట్టు ఎఫ్‌పీఓ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ అధ్యక్షుడు బల్లెడ జయప్రకాష్ తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బెందాళం శ్రీరాంప్రసాద్, ఎంపీటీసీ దుద్ది సతీష్, గెస్ట్ స్వచ్ఛందసేవాసంస్థ అధ్యక్షుడు బల్లెడ శంకరరావు పాల్గొన్నారు.

మద్యం మత్తులో యువకుడు మృతి

ఎచ్చెర్ల క్యాంపస్: అధికంగా మద్యం తాగి యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. ఈ సంఘటన చిలకపాలెంలో సోమవారం చోటుచేసుకోగా విజయనగరం జిల్లా రాజాం మండలం పొగిరి గ్రామానికి చెందిన పొగిరి సంతోష్‌కుమార్ (32) మరణించినట్టు పోలీసులు తెలిపారు. జలుమూరు మండలం శ్రీముఖలింగంలోని అత్తవారింటికి వెళ్లి తిరిగి ప్రయాణంలో చిలకపాలెంలో మద్యం తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. సాయంత్రం వరకూ లేవకపోవడంతో స్థానికుల అనుమానించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారువచ్చి పరిశీలించి మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతునికి రెండేళ్ల క్రితం వివాహం జరిగింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ఎచ్చెర్ల ఎస్సై వి.సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఆఫ్రికాలో భారతదేశం జెండా ఎగరవేసిన రూపాదేవి

ని‘రూప’మాన విజయం

• అంతర్జాతీయ పారా బ్యాడ్మింటన్ పోటీల్లో సత్తాచాటిన రూపాదేవి
• సిల్వర్ సాధించిన సిక్కోలు మణిపూస

జి.సిగడాం: చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయింది. ఆపై రెండు కాళ్లు కూడా చచ్చుబడిపోయాయి. ఆర్థిక పరిస్థితి వెక్కిరించేది. కానీ ఏ అవరోధం ఆమె లక్ష్యాన్ని మార్చలేదు. తదేక దీక్షతో సాధన చేసి అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటింది పారా బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పడాల రూపాదేవి. ఆఫ్రికా ఖండంలో ఉగాండాలో ఈ నెల 4 నుంచి 9వ తేదీ వరకు అంతర్జాతీయ పారా బ్యాడ్మింటన్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో పాల్గొన్న రూపాదేవి రజత పతకం సాధించింది.

సంతవురిటి గ్రామానికి చెందిన పడాల యశోద రెండో కుమార్తె రూపాదేవి ఆరేళ్ల వయసులోనే తండ్రిని దూరం చేసుకుంది. అప్పటి నుంచి తల్లి కష్టపడి కూతురిని చదివించింది. 2019లో ఉండగా డాబా మీద నుంచి పడిపోవడంతో రూపాదేవి రెండు కాళ్లు చచ్చుబడిపోయాయి. అయితే ఆమె తన ఆత్మస్థైర్యాన్ని కోల్పోలేదు. పారా బ్యాడ్మింటన్‌పై దృష్టి సారించి అన్ని స్థాయిల్లో రాణించింది. ఇప్పుడు ఉగాండాలో జరిగిన పోటీల్లో సిల్వర్ గెలిచింది. దీంతో ఆమెపై ప్రశంసల జల్లు కురుస్తోంది.

రాష్ట్రానికే గర్వకారణం..



పడాల రూపాదేవి అంగవైకల్యం అధిగమించి అంతర్జాతీయ స్థాయిలో మూడు వెండిపతకాలు సాధించింది. ఆమె విజయాలు మా ఊరితో పాటు రాష్ట్రానికే గర్వకారణం. ఆమెకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అన్ని విధాలుగా కృషి చేస్తాం. సీఎం దృష్టికి కూడా తీసుకెళ్తాం.

– బుడారి లక్ష్మణరావు సర్పంచ్, సంతవురిటి

విద్యుత్ వెలుగులు



బరిణిపుట్ మార్గంలో ఎల్‌ఈడీ వెలుగులు

జయపురం: స్థానిక పట్టణంలోని హల్లో జయపురం –బరిణిపుట్ 26వ జాతీయ రహదారిలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. 20 ఎల్‌ఈడీ లైట్లను ఆదివారం అమర్చారు. వీటి ఏర్పాటుతో ఆ మార్గం రాత్రి సమయంలో దేదీప్యమానంగా కనిపించింది.

దీపాలను బిజూ కేబీకే(కొరాపుట్–బొలంగీర్–కలహండి) దీర్ఘకాల పథకంలో భాగంగా ఏర్పాటు చేశామని మున్సిపల్ ఈఓ సిద్ధార్థ పట్నాయక్ తెలిపారు.

మార్మోగిన శివ నామస్మరణ



ఉజ్జలేశ్వర్ ఆలయంలో పోటెత్తిన బోల్‌బోం దీక్షాధారులు



ఉజ్జలేశ్వర్ ఆలయంలో బారులు తిరిగిన బోల్‌బం దీక్షాదారులు



ఉజ్జలేశ్వర్ ఆలయంలో బారులు తిరిగిన బోల్‌బం దీక్షాదారులు

రాయగడ: జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్రంగా గుర్తింపు పొందిన కల్యాణ సింగుపూర్‌లో ఉన్న దేవగిరి సోమవారం భోల్‌భం భక్తులతో సందడిగా కనిపించింది. దీక్షలు చేపట్టిన భక్తులు ఆదివారం రాత్రి నుంచే రాయగడ, జేకే పూర్, బిసంకటక్, తెరువలి తదితర ప్రాంతాల నుంచి కాలినడకన అక్కడకు చేరుకున్నారు. సోమవారం తెల్లవారుజామున సమీపంలోని కల్యాణి నది వద్ద పూజాలు జరిపి, కలశాల్లో నదీ జలాన్ని సేకరించారు. అనంతరం కొండపైకి చేరుకుని భక్తిశ్రద్ధలతో నీలకంఠేశ్వరుని దర్శించుకున్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ ప్రత్యేక సౌకర్యాలు ఏర్పాటు చేసింది.

బరంపురం: పరమ శివునికి ప్రీతికరమైన శ్రావణ మాసం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా భోల్‌భం దీక్షలు చేపట్టిన భక్తుల నామ స్మరణతో ఆధ్యాత్మిక వాతావరణ సంతరించుకుంది. జిల్లాలోని అన్ని శివాలయాలు దీక్షాధారులతో కిటకిటలాడాయి. పవిత్ర జలాలను సేకరించి, నగరానికి సమీపంలోని ఉజ్జలేశ్వర్ ఆలయానికి కావడితో మోసుకు వెళ్లారు. ఆ నీటితో స్వామివారికి అభిషేకాలు జరిపి, భక్తిభావాన్ని చాటుకున్నారు.



నది వద్ద పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఆదిత్యుడ్ని దర్శించుకున్న దర్శకుడు మెహర్ రమేష్

• ఆగస్టు 11న ‘భోళాశంకర్’ విడుదలకు సిద్ధం



మెహర్ రమేష్‌కు జ్ఞాపికను అందజేస్తున్న ఈవో హరిసూర్యప్రకాష్

అరసవల్లి: చిరంజీవి నటిస్తున్న భోళాశంకర్ సినిమా దర్శకుడు మెహర్ రమేష్ తన కుమార్తె మోహనతో కలిసి అరసవిల్లి సూర్యనారాయణ స్వామిని సోమవారం దర్శించుకున్నారు. ఈయనకు ఆలయ ఈవో వి.హరిసూర్యప్రకాష్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించగా.. ఆలయ విశిష్టతను శంకరశర్మ వివరించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. మునుపెన్నడూ చూడని స్టైలిష్‌లో.. మెగాస్టార్ చిరంజీవి భోళాశంకర్ సినిమాలో కనిపిస్తారన్నారు. సినిమాను వచ్చేనెల 11వ తేదీన దేశవ్యాప్తంగా విడుదల చేసేందుకు ప్రయత్నిస్తున్నామని ప్రకటించారు. అభిమానుల అంచనాలను సినిమా నిజం చేస్తోందన్నారు. మెగా ఫ్యాన్స్‌కు ఫుల్ మీల్స్ అందించడం ఖాయమన్నారు. చిరంజీవి కోల్‌కత్తాలో మరోసారి అడుగు పెట్టారని..అప్పట్లో ‘చూడాలని వుంది’..ఇప్పుడు భోళాశంకర్ ద్వారా అని వివరించారు. మణిశర్మ కుమారుడు అద్భుత సంగీతాన్ని అందించారన్నారు. చిరంజీవి సినిమాకు పనిచేయడం వరంగా భావిస్తున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ పాలకమండలి సభ్యుడు మండవిల్లి రవి, అఖిల భారత చిరంజీవి యూత్ అభిమానుల సంఘ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తైక్వాండో శ్రీను, జిల్లా అభిమానుల సంఘ ప్రతినిధులు సిద్ధయ్య, మోహన్ ఉన్నారు.

ఆదిత్యుని సన్నిధిలో చోటా కే నాయుడు



అరసవల్లి: చోటా కే నాయుడు దంపతులకు జ్ఞాపిక అందజేస్తున్న మండవిల్లి రవి

అరసవల్లి/జలుమూరు: అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారిని ప్రముఖ సినిమాటోగ్రాఫర్ చోటా కే నాయుడు కుటుంబసమేతంగా సోమవారం దర్శించుకున్నారు. ఆలయ సిబ్బంది సంప్రదాయం ప్రకారం స్వాగతం పలికి అంతరాలయంలో దర్శనం చేయించారు. తీర్థప్రసాదాలను అర్చకుడు ఇప్పిలి రంజిత్ శర్మ ..ఆదిత్యుని జ్ఞాపికను ఆలయ పాలక మండలి సభ్యుడు మండవిల్లి రవి అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫొటో, వీడియోగ్రాఫర్ల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు మెట్ట నాగరాజు, సరస్వతీమహల్ రాజు తదితరులున్నారు. అనంతరం చోటా కే నాయుడు విలేకరులతో మాట్లాడుతూ.. త్వరలో పెద్దకాపు సినిమా రిలీజ్ కానుందన్నారు. అలాగే మెగాస్టార్ చిరంజీవితో ఒకటి, కల్యాణ్‌రామ్‌తో బింబిసార–2 సినిమాలకు ప్రస్తుతం పని చేస్తున్నట్టు చెప్పారు. జలుమూరు మండలం శ్రీముఖలింగంలోని మధుకేశ్వరుడిని కూడా చోటా కే నాయుడు సతీసమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి శేష వస్త్రాలు, తీర్థప్రసాదాలను అర్చకులు అందించారు.

ఎస్పీ స్పందనకు 57 అర్జీలు



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన ఎస్పీ స్పందనకు 57 అర్జీలు అందాయి. కార్యక్రమంలో ఎస్పీ రాధికతో పాటు అదనపు ఎస్పీలు హాజరయ్యారు.

క్లుప్తంగా

సెంచూరియన్ నూతన కమిటీకి సన్మానం

నెల్లిమర్ల రూరల్: మండలంలోని టెక్కలి సెంచూరియన్ వర్సిటీకి కొత్తగా నియమితులైన వీసీ ప్రొఫెసర్ మహంతి, రిజిస్ట్రార్ పల్లవి తదితరులను సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చాన్సలర్ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు మాట్లాడుతూ వర్సిటీ అభివృద్ధికి నూతన కమిటీ కృషి చేయాలని సూచించారు. త్వరలో నాక్ ప్రతినిధుల సందర్శన ఉంటుందని, పరిశోధన పత్రాలు తయారు చేయడంలో ఇబ్బందులు ఉంటే అధ్యాపకులు తమను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో వర్సిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

పన్నుల వసూలుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

- డీఎల్‌పీఓ మోహన్‌రావు

శృంగవరపుకోట: ఇంటి పన్నుల వసూలుపై పంచాయతీ యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధ చూపాలని, రావాల్సిన బకాయిల వసూలు కోసం పనిచేసేలా యంత్రాంగాన్ని సమాయత్తం చేస్తున్నట్లు డీఎల్‌పీఓ మోహన్‌రావు చెప్పారు. ఈ మేరకు సోమవారం ఎస్‌కోట పంచాయతీ కార్యాలయానికి వచ్చిన ఆయనను నాలుగు నెలలుగా పంచాయతీలో కాంట్రాక్ట్ పారిశుద్ధ్య కార్మికులు వేతనాలు లేక ఇబ్బందులు పడుతున్నారని స్థానిక విలేకరులు ప్రశ్నించగా కలెక్టర్ ఆమోదం కోసం పంపామని, త్వరలో ఆమోదం వస్తుందని ఆయన సమాధానమిచ్చారు. అనధికార లేఅవుట్లలో ప్లాన్ అప్రూవల్స్‌పై ప్రశ్నించగా అనధికార లేఅవుట్‌లో అప్రూవల్ ఇచ్చే అధికారం ఎవ్వరికీ లేదన్నారు. నివాసయోగ్యమైన ప్రైవేట్ స్థలంలో ప్లాన్ లేకుండా కట్టేసిన వాటికి 40శాతం ఫైన్‌తో రెగ్యులరైజ్ చేస్తామని, ముందుగా ప్లాన్ కోసం దరఖాస్తు చేస్తే చదరపు మీటరు ఖాళీ స్థలానికి రూ.10, బిల్డింగ్ ఏరియాకు రూ.20 చొప్పున వసూలు చేసి అప్రూవల్ ఇవ్వచ్చని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఇంటి పన్నుల వసూలుపైనే దృష్టి పెట్టామన్నారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

గంట్యాడ: మండలంలోని రామభద్రపురం గ్రామానికి గొల్లు రమేష్ (30) పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రమేష్ మానసిక పరిస్థితి బాగులేక పోవడంతో కొద్ది రోజులుగా మందులు వాడుతున్నాడు. ఎప్పటికీ ఆరోగ్యం కుదుట పడకపోవడంతో మనస్తాపం చెంది ఆదివారం ఇంటి వద్ద పురుగు మందుతాగి అపస్మారక స్థితిలో వెళ్లిపోవడంతో కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై కె.కిరణ్‌కుమార్ నాయుడు తెలిపారు.

మోటార్‌సైకిల్ చోరీపై కేసు నమోదు

కొత్తవలస: మండలంలోని బలిఘట్టం గ్రామానికి చెందిన చిటికిరెడ్డి సూర్యనారాయణ పల్సర్ బైక్ ఈ నెల 3వ తేదీన రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించుకుపోయారు. దీంతో బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సై సీహెచ్.హేమంత్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.కాగా ఆదివారం సాయంత్రం గిడిజాల జంక్షన్ వద్ద పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో చీడివలస గ్రామానికి చెందిన మేకల హరి బైక్‌పై అనుమానాస్పదంగా తిరుగుతుండగా పట్టుకుని విచారణ చేయగా నేరం అంగీకరించాడు. దీంతో నిందితుడిపై కేసు నమోదు చేసి కొత్తవలస జూనియర్ సివిల్ జడ్జి ముందు హాజరుపరచగా జడ్జి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై హేమంత్‌కుమార్ తెలిపారు.

యువకుడి అరెస్టు

బొబ్బిలి: మండలంలోని అలజంగికి చెందిన విద్యార్థిని గర్భం దాల్చి ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన కేసులో బాధ్యుడైన రాపాక గణేష్ అనే యువకుడిని పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. ప్రస్తుతం కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న యువతి పరిస్థితి విషమంగానే ఉంది. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు యువకుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సైలు చదలవాడ సత్యనారాయణ, బి భాగ్యం తెలిపారు.

నేడు రాజాం ఆర్టీసీ కాంప్లెక్స్ నిర్మాణానికి శంకుస్థాపన

రాజాం: రాజాం పట్టణ కేంద్రంలో రైతు బజారు పక్కన నూతన ఆర్టీసీ కాంప్లెక్స్ నిర్మాణానికి మంగళవారం ఉదయం 10 గంటలకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, రాష్ట్ర రోడ్డు రవాణాశాఖ మంత్రి పీనేపు విశ్వరూప్ శంకుస్థాపన చేస్తారని జిల్లా ప్రజా రవాణాఅధికారి సీహెచ్ అప్పలనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ పాల్గొంటారన్నారు.

సైనిక పాఠశాల ప్రిన్సిపాల్‌గా శర్మ

విజయనగరం రూరల్: కోరుకొండ సైనిక పాఠశాల ప్రిన్సిపాల్‌గా ఎస్.ఎస్. శర్మ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న అరుణ్ ఎం.కులకర్ణి హైదరాబాద్‌కు బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో ఎయిర్‌ఫోర్స్ విభాగంలో గ్రూప్ కెప్టెన్‌గా పనిచేస్తున్న ఎస్ఎస్ శర్మను ప్రిన్సిపాల్‌గా నియమిస్తూ సైనికస్కూల్ బోర్డు ఉత్తర్వులు జారీ చేసింది.

అందం చూడవయా..!

- సౌందర్యానికి ప్రాధాన్యం ఇస్తున్న మహిళలు
- కాలానికి అనుగుణంగా మారుతున్న తీరు
- ఔత్సాహికులకు శిక్షణ ఇస్తున్న సంస్థలు
- స్వయం ఉపాధికి మార్గం అంటున్న శిక్షకులు

అందమే ఆనందం..ఆనందమే జీవిత మకరందం అన్నాడో సినీకవి. ఈ మాటను మహిళలు తు,చ తప్పకుండా ఆచరిస్తున్నారు. అందంగా కనిపించాలని తాపత్రయ పడుతున్నారు. ఇంట్లో, వీధిలో, బంధువుల ఇళ్లలో జరిగే వేడుకల్లో ప్రత్యేకంగా కనిపించేందుకు శ్రద్ధ తీసుకుంటున్నారు. కిట్టీ పార్టీల నుంచి పెళ్లిళ్ల వరకు ఏ శుభ కార్యమైనా అతివలదే సందడి. వేడుక ఏదైనా మేకప్ అదరాల్సిందే. వారి ఆశలకు అనుగుణంగానే పట్టణాల్లో బ్యూటీ పార్లర్లు కూడా విస్తరిస్తున్నాయి.


మహిళకు మేకప్ చేస్తున్న బ్యూటీషియన్


హెయిర్ స్పా చేస్తూ..

రాజాం సిటీ: పట్టణాల్లో ఏర్పాటుచేసిన బ్యూటీ పార్లర్లు మగువల అభిరుచులకు తగ్గట్టు నిర్వహిస్తున్నారు. పట్టణం నుంచి పల్లె వరకు నేడు మహిళలు, చిన్నారులు సైతం అందంపైనే మక్కువ చూపుతున్నారు. ఇంట్లో చిన్న చిన్న వేడుకలతోపాటు పెళ్లిళ్ల సీజన్‌లో నిశ్చితార్థం మొదలుకుని ఫొటోషూట్, పెళ్లి తంతు ముగిసే వరకు అందంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. బ్రైడల్ మేకప్, శారీ డ్రాపింగ్, కేశాలంకరణలో ఎక్కడా మేకప్ విషయంలో రాజీపడడంలేదు.

ఆదాయ వనరుగా..

బ్యూటీషియన్ కోర్సు చేసిన మహిళలకు ఇంటి వద్దే ఆదాయవనరు సమకూరుతోంది. ప్రతి నిత్యం బ్రో అందంగా తీర్చిదిద్దడంలో మెళకువలు పాటిస్తూ ఆదాయమార్గాలను అన్వేషిస్తున్నారు. మహిళల ఆసక్తి, అభిరుచి గమనించి బ్యూటీ పార్లర్లలో ప్రత్యేక అలంకరణ చేస్తున్నారు. శరీరతత్వం, రంగు, వేడుకను బట్టి వారికి అమరేలా మేకప్ చేస్తున్నారు. మేకప్ రకం, వాడే మెటీరియల్ బట్టి పారితోషికం కూడా తీసుకుంటున్నారు. ఒక్కోసారి ఇళ్లకు తీసుకువెళ్లి మేకప్ చేయించుకునేందుకు బ్యూటీషియన్లతో ముందుగానే మహిళలు ఒప్పందం కుదుర్చుకుంటున్నారు. ఇళ్లకు వెళ్లి మేకప్ చేసేందుకు సైతం మెటీరియల్‌కు అనుగుణంగా రూ. 4 వేల నుంచి రూ. 10వేల వరకు రేట్లు నిర్ణయించి బ్యూటీషియన్స్ ఆదాయం సంపాదిస్తున్నారు.

శిక్షణతో ప్రోత్సహిస్తున్న సంస్థలు..

మహిళలకు ఉపాధిమార్గాలు చూపేందుకు కొన్ని సంస్థలు బ్యూటీషియన్ కోర్సులలో ఉచితంగా శిక్షణ అందిస్తున్నాయి. దీంతో మహిళలు కూడా ఆసక్తి కనబరిచి శిక్షణ పొందుతున్నారు. అలాగే బ్యూటీ పార్లర్లలో పనిచేసుకుంటూ చిన్న చిన్న చిట్కాలను, మెళకువలను నేర్చుకుంటూ సొంతంగా పార్లర్లను ఏర్పాటు చేసుకుంటూ తమ కాళ్లపై తాము నిలబడగలుగుతున్నారు.

1400 మందికి శిక్షణ..



జీఎంఆర్ నైరెడ్ సంస్థ ద్వారా ఇప్పటి వరకు సుమారు 1400 మందికి బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ అందించాం. యువతులు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు ఇదో చక్కని అవకాశం. పదో తరగతి చదివి ఖాళీగా ఉన్నవారందరినీ ఉపాధిమార్గం వైపు ప్రోత్సహిస్తున్నాం. ఇందులో భాగంగా అందిస్తున్న బ్యూటీషియన్ కోర్స్‌లో చేరి మెళకువలు తెలుసుకుంటున్నారు. సంస్థ స్థాపించిన తరువాత నిర్విరామంగా యువతకు ఉపాధి శిక్షణ ఉచితంగా అందిస్తున్నాం.

– కె.శశిధర్, డైరెక్టర్, జీఎంఆర్ నైరెడ్, రాజాం.

అభిరుచికి తగ్గట్టు..



జీఎంఆర్ నైరెడ్ సంస్థలో బ్యూటీషియన్ కోర్సు నేర్చుకుని సొంతంగా పార్లర్ నడుపుతున్నాను. పార్లర్‌కు వచ్చిన మహిళల అభిరుచికి తగ్గట్టు మేకప్ చేస్తుంటాం. వేడుకలు ఉన్నా లేకపోయినా కొందరు మహిళలు నెలకోసారి బ్యూటీ పార్లర్లకు వచ్చి ఫేషియల్ చేసుకుంటున్నారు. అందంగా ఉన్నామనే ఆత్మవిశ్వాసం మహిళల్లో పెరుగుతోంది. యువతులు కాలానికి అనుగుణంగా మార్పు కోరుకుంటున్నారు. ఎక్కువ మంది ఫంక్షన్లకు అనుగుణంగా పార్లర్‌కు వచ్చి మేకప్ చేయించుకుంటున్నారు. మరికొంతమంది కోరికమేరకు ఇళ్ల వద్దకు వెళ్లి సర్వీసు అందిస్తున్నాం.

– టి.హైమావతి, బ్యూటీషియన్, ఆదిత్య బ్యూటీ పార్లర్, రాజాం.

అపు'రూపా' ప్రతిభ

- అంతర్జాతీయ పారా ఒలింపిక్స్‌లో మూడు రజత పతకాలు కైవసం
- పలువురి అభినందనలు


సిల్వర్ మెడల్స్ సాధించిన అనంతరం ఇండియా జెండాతో రూపాదేవి ఆనందం

రాజాం సిటీ: సంకల్పబలం ఉంటే ఎంతటి విజయాన్నైనా అవలీలగా అందుకోవచ్చని నిరూపించింది ఆమె. రెండు కాళ్లూ పనిచేయకపోయినా మనోధైర్యాన్ని విడవక సడలని సంకల్పంతో ముందుకు దూసుకెళ్తూ పారా బ్యాడ్మింటన్‌లో అంతర్జాతీయస్థాయిలో ఖ్యాతినార్జిస్తోంది. శ్రీకాకుళం జిల్లా జి.సిగడాం మండలం సంతవురిటి గ్రామానికి చెందిన పడాల రూపాదేవి రాజాం పట్టణంలోని ఎస్ఎల్‌టీఎస్ డిగ్రీ కళాశాలలో థర్డ్ ఇయర్ డిగ్రీ చదువుతోంది. ఈ నెల 3 నుంచి 9 వరకు దక్షిణాఫ్రికా ఖండంలో గల ఉగాండా దేశంలోని కంపాలా నగరం వేదికగా నిర్వహించిన అంతర్జాతీయ పారా బ్యాడ్మింటన్-2023లో ఆంధ్రప్రదేశ్ తరఫున ఆమె పాల్గొని సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్‌లో వేరువేరుగా మూడు రజత పతకాలను సొంతం చేసుకుని తనకు తానే సాటి అని నిరూపించుకుంది. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పేరు తీసుకురావడంతో పలువురు అభినందిస్తున్నారు. ఆమె ప్రతిభ పట్ల కళాశాల యాజమాన్యంతో పాటు రాజాం పట్టణవాసులు అభినందనలు తెలిజేశారు.

గ్రామస్తుల ఇబ్బందులు తొలగించాలి

- విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ


మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ

విజయనగరం అర్బన్: జాతీయ రహదారుల నిర్మాణం వల్ల సమీప గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ కోరారు. ఈ మేరకు విజయనగరం – రాజమండ్రి 516 జాతీయ రహదారి నిర్మాణం వల్ల తాటిపూడి, మధుపాడ, మదనాపురం, కొత్త వెలగాడ, తామరాపల్లి తదితర గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై, కలెక్టర్ చాంబర్‌లో సోమవారం, రైతులు, సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ముందుగా ఆయా గ్రామాల రైతుల సమస్యలను తెలుసుకున్నారు. జాతీయ రహదారి నిర్మాణం వల్ల మధుపాడ నుంచి తాటిపూడి శివాలయానికి రోడ్డు లేకుండా పోయింది. తాటిపూడి వద్ద పీఎస్ఆర్ పురం కల్వర్టు మూసుకుపోయింది. యుటిలిటీ రోడ్డు, కాలువ దెబ్బతిన్నాయి. ఎప్రోచ్ రోడ్డు కావాలని, సీతమ్మచెరువు నుంచి వర్షపు నీరు బయటకు పోయే కాలువ మూసుకుపోయిందని గ్రామస్తులు తెలిపారు.

అనంతరం మంత్రి మాట్లాడుతూ గ్రామస్తులు ప్రస్తావించిన సమస్యలన్నిటినీ పరిష్కరించాలని ఆదేశించారు. వర్షపు నీరు పోయేందుకు కాలువలను నిర్మించడానికి భూసేకరణ చేయాలని అందుకు రైతులు కూడా సహకరించాలని సూచించారు. సమావేశంలో కలెక్టర్ నాగలక్ష్మి, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంఎల్‌సీ డాక్టర్ పి.సురేష్‌బాబు, గజపతినగరం ఎంఎల్ఏ బొత్స అప్పలనరసయ్య, జేసీ మయూర్ అశోక్, డీఆర్‌ఓ ఎం.గణపతిరావు, ఆర్‌డీఓ ఎంవీసూర్యకళ, గంట్యాడ జెడ్పీటీసీ వర్రి నర్సింహమూర్తి, తహసీల్దార్ రాఘవ, డీటీ స్వర్ణకుమార్, తాటిపూడి రిజర్వాయర్ ఆయకట్టదారుల సంఘం అధ్యక్షులు గొర్రుపాటి బుచ్చప్పారావు, బోలెం ఎర్రినాయుడు, తాటిపూడి సర్పంచ్ కోడెల ముత్యాలనాయుడు, మదనాపురం సర్పంచ్ జె.అప్పారావు, ఇతర నాయకులు, ఇరిగేషన్, నేషనల్ హైవేస్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

వలంటీర్ వ్యవస్థ దేశంలోనే అత్యుత్తమం

ప్రజల సంక్షేమ కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మన రాష్ట్రంలో ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ దేశంలోనే అత్యుత్తమైనదని మంత్రి బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, వలంటీర్లపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. వలంటీర్ అంటే ఆ కుటుంబాలకు చెందిన వ్యక్తేనని, అక్కడి 50 ఇళ్లలోని ఒకరని, బయట ఎక్కడనుంచో రాలేదని చెప్పారు. రాజకీయాల్లో ప్రభుత్వ విధానాలమీద, పాలన మీద విమర్శలు ఉండాలే తప్ప, ఇటువంటి అభ్యంతరకర మాటలు సరికాదని హితవు పలికారు. విలువలు, వ్యక్తిత్వం లేనివారు రాజకీయాల్లోకి వస్తే ఇలాగే ఇంటుందని ధ్వజమెత్తారు.

అర్జీలకు సంతృప్తికర పరిష్కారం

- కలెక్టర్ నిషాంత్‌కుమార్


అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: అర్జీదారులు అనేక కష్టనష్టాలకు ఓర్చి జిల్లా కేంద్రానికి చేరుకుంటారని, వారి అర్జీలకు సంతృప్తి కర పరిష్కారం చూపాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్‌కుమార్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన కలెక్టరేట్‌లో జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా, మండల అధికారులు, గ్రామవార్డు సచివాలయాల సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీచేశారు. సచివాయం, మండలస్థాయిలో పరిష్కారమయ్యే సమస్యలను అక్కడే పరిష్కరించాలని సూచించారు. మండలస్థాయిలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం పక్కాగా నిర్వహించాలని చెప్పారు. అర్జీదారులతో ప్రేమపూర్వకంగా ఉండాలని, వారి సమస్యను అర్థం చేసుకుని పరిష్కారం చూపాలని పేర్కొన్నారు. సచివాలయం పరిధిలో పరిష్కారం కానివి మండల స్థాయిలో పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు, ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్‌లతో కలిసి ప్రజల నుంచి 97 అర్జీలను కలెక్టర్ నిషాంత్ కుమార్ స్వీకరించారు. కార్యక్రమంలో జిల్లా అటవీ అధికారి జీపీపీ పి.ప్రసూన, డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్ కుమార్, డీఎంహెచ్‌ఓ బి. జగన్నాథరావు, జిల్లా ఆర్‌బ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకర రావు, డీపీఓ బి.సత్యనారాయణ, జిల్లా పౌరసరఫరాల అధికారి సూర్యారావు, జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి, డాక్టర్ ఎంవీఆర్. కృష్ణాజీ, డీఈఓ ఎన్. ప్రేమ్‌కుమార్, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి కె.విజయ గౌరి, జిల్లా ప్రణాళిక అధికారి పి.వీరరాజు, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి ఎం.డి.గయాజుద్దీన్ ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

12 నుంచి జాతీయస్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీలు

రాజాం సిటీ: జాతీయస్థాయి మాస్టర్స్ ఎక్విప్డ్ స్త్రీ, పురుషుల పవర్ లిఫ్టింగ్ చాంపియన్-2023 పోటీలకు జీఎంఆర్ ఐటీ వేదిక కానుందని పీడీ బీహెచ్ అరుణ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 12 నుంచి 16వ తేదీ వరకు ఐదు రోజులపాటు ఈ పోటీలు జరగనున్నాయని పేర్కొన్నారు. ఈ పోటీల్లో దేశంలోని 24 రాష్ట్రాల నుంచి 40 సంవత్సరాలుపైబడిన 400 మంది పురుషులు, 100 మంది స్త్రీలు పాల్గొంటారని, దేశం నలుమూలల నుంచి 40 మంది టెక్నికల్ సిబ్బంది న్యాయనిర్ణేతలుగా హాజరుకానున్నారన్నారు.

అంగన్వాడీ కార్యకర్తల ఆందోళన


ఆందోళనలో మాట్లాడుతున్న నాయకులు

పార్వతీపురం: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు 36 గంటలపాటు ధర్నాను కలెక్టరేట్ వద్ద సోమవారం చేపట్టారు. హెల్పర్స్‌కు ప్రమోషన్లు, వయోపరిమితి 50 ఏళ్లకు పెంచాలని కోరారు. మినీ వర్కర్లుకు ప్రమోషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంపూర్ణ పోషణ మెనూ చార్జీలను పెంచాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వివిధ మండలాల అంగన్వాడీ టీచర్లు, వర్కర్లతో పాటు యూనియన్ నాయకురాళ్లు జ్యోతి, సరళ, రామలక్ష్మి, అమరజీవి తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి సేవలో చోటా కె.నాయుడు


కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో చోటా కె.నాయుడు దంపతులను సత్కరిస్తున్న ఆలయ కమిటీ, అభిమానులు

చీపురుపల్లి: సినీ కెమెరామన్ చోటా కె.నాయుడు సతీసమేతంగా చీపురుపల్లిలోని కనకమహాలక్ష్మి అమ్మవారిని సోమవారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ కమిటీ వైస్ చైర్మన్ సూరుకుమార్ నేతృత్వంలో అర్చకులు స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపి తీర్థప్రసాదాలు అందజేశారు. అంతకుముందు పుర్రేయవలస సమీపంలోని శ్రీ మానసాదేవి నాగశక్తి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయనను చిరంజీవి ఫ్యాన్స్ అసోసియేషన్ సభ్యులు ఎస్‌వీజీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆయనను సత్కరించారు. రాష్ట్ర ఫొటో, వీడియో గ్రాఫర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జీఎఫ్ఎక్స్ ఫొటో స్టూడియోను సందర్శించారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర కోశాధికారి చిలకుర్తి శేషు, ఆర్గనైజింగ్ సెక్రటరి సుంకరపల్లి సతీష్, పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు పి.శ్యాంబాబు, ఎల్.శేషు, చీపురుపల్లి నియోజకవర్గ ప్రతినిధులు ఎం.నర్సింగరావు, లాభాన శ్రీను పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన వీఆర్ఎస్ ఆధునికీకరణ పనులు

- రూ.63.5 కోట్ల జైకా నిధులు కేటాయింపు
- ఇప్పటికి రూ.10 కోట్ల విలువైన పనులు పూర్తి
- 18.7 కిలోమీటర్ల పొడవునా కాలువల నిర్మాణం


వీఆర్ఎస్ ప్రాజెక్టు ప్రధాన కాలువ సిమెంట్ నిర్మాణం


జరుగుతున్న లైనింగ్ పనులు

సీతానగరం: వెంగళరాయసాగర్ సాగునీటి ప్రాజెక్టు పరిధిలోని ప్రధాన, పిల్ల కాలువల ఆధునికీకరణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఉమ్మడి విజయనగరం జిల్లాలోని సాలూరు, బొబ్బిలి, పార్వతీపురం అసెంబ్లీ నియోజక వర్గాలకు చెందిన 24,700 ఎకరాల ఆయకట్టుకు సాగు నీరందించేందుకు సాలూరు సమీపంలో మామిడిపల్లి వద్ద వెంగళరాయసాగర్ ప్రాజెక్టును నిర్మించారు. అప్పట్లో మట్టితో కాలువలు నిర్మించడం వల్ల ఏటా భారీ వర్షాలు కురిసిన సమయంలో గండ్లు పడుతున్నాయి. ఆయకట్టుకు సరిగా నీరు అందని పరిస్థితి. దీనిని అధిగమిస్తూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.63.5కోట్ల జైకా నిధులతో ప్రధాన కాలువను 38.45 కిలోమీటర్ల పొడవున శాశ్వత ప్రాతిపదికన సిమెంట్‌తో నిర్మిస్తోంది. మొదటివిడతగా రూ.48.89 కోట్ల వ్యయంతో పనులు చకచకా సాగుతున్నాయి. సాలూరు, మక్కువ, సీతానగరం ప్రాంతాల మధ్య ఇప్పటివరకు రూ.10 కోట్ల వ్యయంతో 7 కిలోమీటర్ల పొడవున ప్రధాన కాలువను సిమెంట్, కాంక్రీట్‌తో నిర్మించారు. మిగిలిన 31.45 కిలోమీటర్ల మేర కాలువ పనులు పూర్తిచేసేందుకు ప్రణాళికా బద్ధంగా ముందుకు సాగుతున్నట్టు వీఆర్ఎస్ ప్రాజెక్టు డీఈ ఆర్.సురేష్‌కుమార్ తెలిపారు. వాతావరణ అనుకూలిస్తే పనులు నిర్దేశించిన గడువులోగా పూర్తిచేస్తామన్నారు.

రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు జిల్లా జట్లు సిద్ధం


సీనియర్స్ విభాగంలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్ర స్థాయిలో సీనియర్స్ విభాగంలో జరగనున్న బ్యాడ్మింటన్ పోటీలకు జిల్లా జట్లు సిద్ధమయ్యాయి. జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా నిర్వహించిన పోటీల్లో భాగంగా మెన్ అండ్ ఉమెన్స్ కేటగిరీలో సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో నిర్వహించిన పోటీలకు జిల్లా నలుమూలల నుంచి 70 మంది క్రీడాకారులు హాజరయ్యారు. వీరిలో మెన్స్ సింగిల్స్ విభాగంలో కె.పవన్, కె.ముకేష్‌లు ప్రథమ, ద్వితీయ స్థానాలు దక్కించుకోగా.. డబుల్స్ విభాగంలో ఎస్.దినేష్‌కుమార్, ఆర్ మోహనరావుల జట్టు విజేతగా నిలిచింది. ఉమెన్స్ సింగిల్స్ విభాగంలో బి.హారిక, పి.మౌనికలు మొదటి రెండు స్థానాలు చేజిక్కించుకోగా.. డబుల్స్ విభాగంలో బి.హారిక,మౌనికల జట్టు విజయం సాధించింది. జిల్లా స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, ప్రధాన కార్యదర్శి వై.కుసుంబచ్చన్, అసోసియేషన్ ప్రతినిధులు ఎం.కె.బి.శ్రీను, నున్న సురేష్, పొట్నూరు శ్రీరాములు అభినందించారు. జిల్లా స్థాయిలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు త్వరలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు.

అపూర్వ సమ్మేళనం


సైనిక పాఠశాల వద్ద కుటుంబ సభ్యులతో 1973- 81 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

- రూ.కోటి విరాళం అందజేసిన పూర్వ విద్యార్థులు

విజయనగరం రూరల్: కోరుకొండ సైనిక పాఠశాలలో 1973–81 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం సోమవారం ఉల్లాసంగా, ఉత్సాహంగా సాగింది. వారి హైస్కూల్ విద్య ప్రారంభమై 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా దేశ విదేశాల నుంచి కుటుంబసమేతంగా హాజరైన వారంతా నాటి జ్ఞాపకాలను సహచరులతో పంచుకుని ఆనందపరవశులయ్యారు. పూర్వ విద్యార్థులంతా పాఠశాలలో గడిపిన జ్ఞాపకాలు, వారు సంచరించిన ప్రదేశాలు, ఆటస్థలాలు, వారు ఉన్న వసతి గృహాలను కుటుంబసమేతంగా సందర్శించి ఉద్వేగానికి గురయ్యారు. అనంతరం పాఠశాల ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో విద్యాభ్యాసం చేసి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని హితవు పలికారు. కోరుకొండ సైనిక పాఠశాలకు దేశంలోనే ప్రత్యేక స్థానం ఉందని, పాఠశాల పేరు ప్రఖ్యాతులను నిలపడానికి విద్యార్థులు మరింత కృషి చేయాలని ఆకాంక్షించారు. వారు సాధించిన విజయాలను ప్రస్తుత విద్యార్థులకు వివరించి వారిలో స్ఫూర్తి నింపారు. పూర్వ విద్యార్థులలో కొందరు ఆనాడు సాధించిన పతకాలను పాఠశాలలో ప్రదర్శనార్థం బహూకరించారు. ఈ సందర్భంగా భోజనశాల వసతిగృహం ఆధునికీకరణకు 1973– 81 బ్యాచ్ పూర్వ విద్యార్థులు రూ. కోటి విరాళాన్ని పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్ఎస్ శర్మకు అందజేశారు. పూర్వ విద్యార్థుల ఔదార్యానికి ప్రిన్సిపాల్ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎ.కేశవన్, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో స్విమింగ్‌పూల్‌లో పడి వ్యక్తి మృతి

కొత్తవలస: మండలంలోని కొత్తవలస మేజర్ పంచాయతీ పరిధి చీపురువలస గ్రామంలో గల బీఎస్ఎన్ గార్డెన్‌లో విశాఖపట్నానికి చెందిన ఇంటి గణేష్(44) తాగిన మైకంలో స్విమింగ్ పూల్‌లో పడి ఆదివారం మరణించినట్లు సీఐ ఎస్.బాలసూర్యారావు సోమవారం తెలిపారు. ఈ వార్త ఆలస్యంగా వెలుగు చూసింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. విశాఖపట్నానికి చెందిన గణేష్ విశాఖపట్నం 104-ఏరియాలో మహేంద్ర ఆటోమొబైల్ షోరూమ్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు.అదే షోరూమ్‌లో పనిచేసే 10 మంది వ్యక్తులతో కలిసి శనివారం రాత్రి బీఎస్ఎన్ గార్డెన్‌లో మద్యం పార్టీకి వచ్చాడు. ఆదివారం మధ్యాహ్నం వరకు వారంతా పూటుగా మద్యం తాగి ఎంజాయ్ చేశారు. మధ్యాహ్న సమయంలో గణేష్ పక్కనే గల స్విమింగ్ పూల్‌లో పడిపోయాడు. స్నేహితులు ఆలస్యంగా చూడడంతో అప్పటికే అపస్మారక స్థితికి చేరుకున్నాడు. వెంటనే కారులో కొత్తవలసలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లి చూపించగా పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పడంతో విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు.అప్పటికే గణేష్ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. దీంతో మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి ఇద్దరదు కుమారులు 19 సంవత్సరాల నరేంద్ర, 17 సంవత్సరాల నువేజ్ ఉన్నారు.

అధికంగా మద్యం తాగి మరో యువకుడు..


సంతోష్‌కుమార్ మృతదేహం

ఎచ్చెర్ల క్యాంపస్: అధికంగా మద్యం తాగిన ఓ యువకుడు మత్తులోనే ప్రాణాలు కోల్పోయాడు. శ్రీకాకుళం జిల్లా చిలకపాలెంలో సోమవారం జరిగిన ఈ సంఘటనలో విజయనగరం జిల్లా రాజాం మండలం పొగిరి గ్రామానికి చెందిన పొగిరి సంతోష్‌కుమార్ (32) మరణించాడు. జలుమూరు మండలం శ్రీముఖలింగంలోని అత్తవారింటికి వెళ్లిన సంతోష్‌కుమార్ తిరుగు ప్రయాణంలో చిలకపాలెంలో మద్యం తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. సాయంత్రం వరకూ లేవకపోవడంతో స్థానికులు అనుమానించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారువచ్చి పరిశీలించి మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి రెండేళ్ల క్రితం వివాహం జరిగింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ఎచ్చెర్ల ఎస్సై వి.సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పిడుగుపాటుతో వలస కూలీ..


పిడుగుపాటుకు మృతిచెందిన భాస్కర్

వేపాడ: మండలంలోని వీలుపర్తి పంచాయతీ దుంగాడ క్వారీలో పనిచేస్తున్న వలస కూలీ పిడుగు పాటుతో మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. అనకాపల్లి జిల్లాకు చెందిన వలస కూలీ కోటపల్లి భాస్కర్ (22) దుంగాడ క్వారీలో మిషన్ హెల్పర్ పనిచేస్తున్నాడు. సోమవారం సాయంత్రం మెట్టపై క్వారీ పనులు చేస్తుండగా పిడుగు పడడంతో గాయపడ్డాడు. వెంటనే సహచరులు ఎస్‌కోట ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.